ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 30 జూన్ 2025



కన్నడ సాహిత్య సమ్మేళన అధ్యక్షురాలిగా బాను ముస్తాక్



బళ్లారి సిటీ,జూన్ 29(ఆంధ్రజ్యోతి): డిసెంబర్‌లో బళ్లారిలో జరగనున్న 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళన అధ్యక్షురాలిగా ప్రముఖ రచయిత, బుకర్ ప్రైజ్ గ్రహీత బాను ముస్తాక్‌ను ప్రకటించారు. ఆదివారం బళ్లారిలో సాహిత్య పరిషత్ కార్యనిర్వాహక కమిటీ సమావేశం తర్వాత విలేకరుల సమావేశంలో కన్నడ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ జోషి ఈ విషయాన్ని ప్రకటించారు.



కాల్ చేసి.. కాజేస్తారు..!



రాజధానిలో 4,092 కేసులు

బలవుతున్న అమాయకులు

- రాష్ట్రంలో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- డిజిటల్ అరెస్ట్, బెదిరింపులతో ఖాతాలకు కన్నం
- ఏడాదిలో రూ.2,914 కోట్ల దోపిడీ
- రికవరీ 20 శాతమే..

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఖాతాల్లో ఉన్న సొమ్మును ఒక్క క్లిక్‌తో దోచేస్తున్నారు. ఒకప్పుడు సినిమా హాళ్లు, బస్టాండ్‌లలో పిక్ ప్యాకెట్‌లు, బ్యాగులు చోరీ చేసేవారు. ఆ తర్వాత ఇళ్లలోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు మాత్రం దోచేవారు. తర్వాతి కాలంలో ఇళ్లలోకి చొరబడే దోపిడీ దొంగలు హతమార్చేందుకు వెనుకాడేవారు కాదు. ఇలా కాలానుగుణంగా దొంగల్లోనూ మార్పు వచ్చింది. ఇటువంటి నేరాల్లో దొంగలు ఆ వెంటనే లేదా కొంతకాలం తర్వాత పట్టుబడేవారు. దీంతో ఎంతోకొంత రికవరీ అయ్యేది. చైన్‌స్నాచర్‌లు, ముఠాలుగా ఏర్పడి దోపిడీలు చేసేవారు, ఇతర రాష్ట్రాలనుంచి విమానాలలో వచ్చి చోరీ చేసి వెళ్లిపోయేవారు. కానీ ఇటీవలికాలంలో మనిషి కనిపించకుండా మృదువైన మాటలతో ఫోన్‌లో నమ్మించి ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు. దేశ విదేశాల్లో కూర్చుని బ్యాంకు ఖాతాలకు కన్నం వేస్తున్నారు. డిజిటల్ అరెస్టు అంటూ బెదిరింపులకు పాల్పడుతూ ఏకంగా కోర్టు, సీబీఐ కార్యాలయాలను సృష్టిస్తున్నారు. సైబర్ నేరాల్లో అమాయకులే కాదు న్యాయవాదులు, డాక్టర్లు వంటి విద్యావంతులను సైతం బోల్తా కొట్టిస్తున్నారు. నాలుగైదేళ్లుగా సైబర్ నేరాలు భారీగా పెరిగిపోయాయి. ఒకప్పుడు అండర్‌వరల్డ్ డాన్‌లు ఫోన్ చేసి మాకు లక్షలు, కోట్లు సమకూర్చాలని బెదిరిస్తే కేసులు పెట్టేవారు. కానీ, సైబర్ నేరాలకు పాల్పడేవారు అంతకంటే సున్నితంగా మాట్లాడుతూనే కోట్లు కొట్టేస్తున్నారు. ఇది రాష్ట్రంలోనే కాదు... దేశమంతటా పెను ప్రమాదానికి సంకేతమవుతోంది. డిజిటల్ అరెస్టు పేరిట ఇంటినుంచి బయటకు రాకూడదని, వీడియోకాల్‌లో నిరంతరం అందుబాటులో ఉండాలని బెదిరిస్తున్నారు. ఇదంతా కొత్తతరం నేరంగా మారింది. వీటన్నింటికంటే డిజిటల్ అరెస్టు వేళ లోదుస్తులలో కెమెరాలు ఉండవచ్చునని, బట్టలు మార్చుకోవాలని నమ్మించి ఆ తర్వాత నగ్నఫొటోలు, వీడియోలను సోషల్‌మీడియాలో పోస్టు చేస్తామని బెదిరిస్తూ ఉన్నదంతా దోచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు పలు చర్యలు తీసుకుంది. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'డిజిటల్ అరెస్టు అనేది లేదని అలా ఎవరైనా బెదిరిస్తే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని' సూచించారు. మొబైల్ కాలర్‌ట్యూన్ ద్వారా ప్రతిరోజూ కోట్లాదిమందికి అవగాహన కల్పిస్తున్నారు. అయినా సైబర్ నేరాలు మాత్రం సాగుతూనే ఉన్నాయి.

బెంగళూరులో 19 పోలీస్‌స్టేషన్లలో కేసుల వివరాలు

మోసం విధానం	కేసులు	సొమ్ము	శాతం
పెట్టుబడులు	1756	468,20,40,279	70.51
ఉద్యోగాలు	655	80,16,52,374	12.07
డిజిటల్ అరెస్టు	667	58,33,71,846	8.79
క్రెడిట్‌కార్డు	280	19,20,44,549	2.89
ఓటీపీ పేరిట	114	6,73,99,210	1.01
సోషల్‌మీడియా ద్వారా	52	1,91,28,667	0.29
మొత్తం	4,092	664,13,74,010	100

రికవరీ అయ్యింది అరకొరే..

ఇదేమీ ఓ పథకం అమలుకు రాష్ట్రప్రభుత్వమో కేంద్రప్రభుత్వమో విడుదల చేసిన గ్రాంటు కాదు... కేవలం ఏడాది వ్యవధిలో రాష్ట్రంలో 2,914 కోట్ల రూపాయలు సైబర్ నేరగాళ్లు దోచేశారు. పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వస్తాయని, ఉద్యోగాలు కల్పిస్తామని పేమెంట్ చేయాలని, భూములు ఇప్పిస్తామని ముందుగా అడ్వాన్స్ చెల్లించాలని సోషల్‌మీడియా ద్వారా ఆకట్టుకుంటారు. ఓఎల్ఎక్స్‌తోపాటు వ్యాపార అవకాశాలు కల్పిస్తామని గిఫ్ట్‌లు, మ్యాట్రిమొనితోపాటు ప్రకటనలు వంటి పేర్లతో మోసాలు చేస్తున్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయి.

జాతీయ, ప్రైవేట్‌బ్యాంకుల్లో దాచుకున్న సాధారణ ఖాతాదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల సొమ్మును సునాయాసంగా దోచేస్తున్నారు. 2024 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ బ్యాంకులతోపాటు ఇతరత్రా 2914 కోట్ల రూపాయలు సైబర్ నేరస్థుల ఖాతాలకు బదిలీ అయినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలో 6,11,688 కేసులు సైబర్ పోలీస్‌స్టేషన్‌ల్లో నమోదయ్యాయి. సైబర్ మోసాల్లో కోల్పోయిన సొమ్ములో వాపసు లభించింది కేవలం 20శాతమేనని తెలుస్తోంది. అధికంగా అమాయకులే సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారు.

బ్యాంకులు	ఫిర్యాదులు	సొమ్ము (కోట్లు)
ప్రైవేట్‌బ్యాంకులు	3,02,324	1859.9
ప్రభుత్వరంగ	2,55,034	948.54
స్మాల్ ఫైనాన్స్‌బ్యాంకు	25,159	17.87
ప్రాంతీయ గ్రామీణబ్యాంకు	12544	1.84
విదేశీబ్యాంకులు	9591	78.14
సహకారబ్యాంకులు	7036	8.68

ప్రభుత్వానికి సీఐడీ నివేదిక

సైబర్ నేరాల అధ్యయనం జరిపిన సీఐడీ విభాగం ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించింది. సైబర్ నేరాల్లో అక్రమంగా నగదును నకిలీ ఖాతాల్లోకి బదిలీ అవుతోంది. ఆర్థిక మోసాలకు సంబంధించి నేషనల్ సైబర్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో నమోదైన ఫిర్యాదులతో కలిపి బ్యాంకింగ్ రంగంలో నియంత్రణకు రానివిధంగా మోసాలు జరిగినట్లు సీఐడీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు. ఖాతాదారులు జాగ్రత్తగా మసలుకోవాలని, పరిచయం లేనివారు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అపరిచిత కాల్స్ మాట్లాడడం కానీ, వాట్సప్‌లో ఫొటోలు డౌన్‌లోడ్ చేయరాదని సూచిస్తున్నారు.





సతీశ్, రమేశ్ జార్కిహొళి

పక్కపక్కనే ఉన్నా.. పలకరింపు లేదు..

- ఒకే వేదికపై జార్కిహొళి సోదరులు

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు వేరైనా వారిద్దరూ అన్నదమ్ములు. బెళగావి జిల్లా గోకాక్ పట్టణంలో పదేళ్ల తర్వాత జరుగుతున్న లక్ష్మీదేవి జాతర సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. సొంతూరు పైగా ఇద్దరూ ప్రముఖ నాయకులు కావడంతో ఆహ్వానించగా హాజరయ్యారు. పక్కపక్కనే కూర్చున్న అన్నదమ్ములు ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి, బీజేపీ మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళిలు ఎడమొహం పెడమొహంగానే గడిపారు. జిల్లా అధికారి జాతరకు సంబంధించిన ఏర్పాట్లను వివరించారు. సభ ప్రారంభం నుంచి ముగిసేదాకా పక్కనే కూర్చున్నా పలకరించుకోలేదు. పైగా ఒకరినొకరు చూసుకోలేదు కూడా... ఒకప్పుడు ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. 2019లో జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చడంలో రమేశ్‌జార్కిహొళి కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత బీజేపీలో కొనసాగి మంత్రి అయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డంతో సతీశ్ జార్కిహొళి కీలకమైన మంత్రి పదవిలో గడుపుతున్నారు.



రగులుతున్న అసంతృప్తి..!



సుర్జేవాలా

- కాంగ్రెస్‌లో మంటలు చల్లారేనా..?
- నేడు రాష్ట్రానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సుర్జేవాలా
- ఎమ్మెల్యేలకు డీసీఎం డీకే శివకుమార్ ఫోన్
- అర్ధరాత్రి డీకేతో పరమేశ్వర్ భేటీ

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన తర్వాత ఎమ్మెల్యేలలో అసంతృప్తి రగులుతోంది. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణ జరిగితే అవకాశం దక్కవచ్చునని భావిస్తున్నవారు పలుమార్లు నిరుత్సాహపడ్డారు. దీనికితోడు నియోజకవర్గాలలో కనీసమైన పనులు సాగడం లేదని పైగా మంత్రులు పట్టించుకోరనే కారణాలు చూపుతూ బహిరంగ విమర్శలకు సిద్ధమయ్యారు. 2023 మే నెలలో సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. డీసీఎం డీకే శివకుమార్ సీఎం హోదా కోసం తీవ్రంగా ప్రయత్నించి చివరిక్షణంలో వదులుకున్నారు. అందుకు రాష్ట్ర కాంగ్రెస్ చరిత్రలో ఎవరికీ లేని విధంగా ఎన్నడూ జరగని విధంగా రాష్ట్ర అధ్యక్ష పదవిని కొనసాగిస్తూనే డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధి, భారీ జలవనరులశాఖ మంత్రి గా అవకాశం ఇచ్చారు. అన్ని పదవులు ఒకరికే సమంజసం కాదని పలువురు సీనియర్ నేతలు బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. అంతలోనే అధిష్ఠానం హెచ్చరిస్తూ అణిచివేస్తోంది. రెండేళ్ల పాలన ముగియగానే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఈ ఏడాది ఆరంభం నుంచి విస్తరణ అంశం వాయిదాలు పడుతూనే వస్తోంది. అధిష్ఠానం నేత కేసీ వేణుగోపాల్ కూడా విస్తరణ అంశాన్ని ప్రస్తావించారు. కారణం ఏదైనా వాయిదాలు పడుతూ వస్తున్నాయి. ఇటీవల కొన్ని రోజులుగా ఎమ్మెల్యేలు, మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు పలు అనుమానాలకు రేకెత్తిస్తున్నాయి. సీనియర్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ కలబురగి జిల్లాలో లంచం ఇవ్వకుంటే హౌసింగ్‌లో లబ్ధిదారుల ఎంపిక జరగదని వ్యాఖ్యానించారు. అంతలోనే బెళగావి జిల్లా ఎమ్మెల్యే రాజుకాగె ప్రభుత్వం తమదేనని పేరుకు మాత్రమే అని, గ్రాంట్లు రావడం లేదని, కనీసమైన అభివృద్ధి చేయలేకపోతున్నామని ఇలాగే కొనసాగితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. మరో సీనియర్ ఎమ్మెల్యే ఎస్‌వై గోపాలకృష్ణ మాట్లాడుతూ ఏం పదవుల్లో మావని, ఓ రోడ్డు, కాలువ కూడా వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గ్రాంట్లు ప్రకటిస్తున్నారుగానీ ఏడాది ముగిసినా వర్క్ ఆర్డర్ ఇవ్వడం లేదని వాపోయారు. ఇక మరో ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే శక్తిగ్యారెంటీతో ఆర్టీసీ బస్సుల్లో పురుషులు ప్రయాణించే పరిస్థితి లేకుండా పోయిందని, ఎంతకాలం ఉచితమన్నారు. ఇలా సాగుతుండగానే మంత్రి రాజణ్ణ మరోబాంబు వేశారు. సెప్టెంబరులో కొంత మార్పు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు బహిరంగంగా విమర్శలు చేయడాన్ని అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించింది. ఇటీవలే రెండు రోజులపాటు ఢిల్లీలో గడిపిన ముఖ్యమంత్రికి తీవ్రస్థాయిలోనే అసమ్మతి రగులుతోందని సర్దుబాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు బహిరంగంగా మాట్లాడడం తగదని హెచ్చరించారు. ఢిల్లీ నుంచి వెనుదిరిగిరాగానే పలువురు ఎమ్మెల్యేలను పిలిపించుకుని సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. ఇలా సాగుతున్న తరుణంలోనే శనివారం రాత్రి పొద్దుపోయాక హోం మంత్రి పరమేశ్వర్, డీసీఎం డీకే శివకుమార్‌ను భేటీ అయ్యారు. వారిద్దరూ పవర్‌షేరింగ్ గురించి మాట్లాడుకున్నారా...? అనే చర్చ ఆదివారం హల్‌చల్ చేసింది. రాత్రి పొద్దుపోయాక ఏ అంశంపై చర్చించేందుకు కలిశారనేది కుతూహలమైంది. ఇలా సాగుతున్న తరుణంలోనే సోమవారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా నగరానికి రానున్నారు. ఎమ్మెల్యేలకు ఏమైనా సమస్యలు ఉంటే ఏ అంశమైనా నేరుగా సుర్జేవాలాను కలసి చెప్పుకోవచ్చునని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సూచించారు. ఆదివారం పలువురు ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి డీసీఎం వివరించారు. సుర్జేవాలాతో కేవలం గ్రాంట్లు రాలేదనే అంశం కంటే... ఇతరత్రా అంశాలు ప్రస్తావించే అవకాశం ఉందని తెలుస్తోంది. సుర్జేవాలాతో ఎమ్మెల్యేలు ప్రస్తావించే అంశాలు హాట్ టాపిక్ కానున్నాయి.





మిరప రైతు మీమాంస..!

- ఈ ఏడు సాగు చేద్దామా.. వద్దా
- తుంగభద్ర ఆయకట్టు రైతు సందిగ్ధం
- గతేడాది భారీగా నష్టపోయిన వైనం

బళ్లారి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టులో ఈ ఖరీఫ్ సీజన్‌లో మిరప పంట సాగు చేయాలా..? వద్దా..? అనే సందిగ్ధంలో అన్నదాతలు ఉన్నారు. గతేడాది మిరప రైతులు పెద్ద మొత్తంలో నష్టపోయారు. క్వింటాల్ మిరప రూ. 6 వేలకు తగ్గిపోవడంతో రైతులకు భారీ నష్టమే మిగిలింది. అంతకు ముందు ఏడాది మిరపకు భారీ డిమాండ్ ఉండేది. క్వింటం రూ. 50 వేల వరకూ ధర పలికింది. అంతే కాకుండా శీతలగిడ్డంగుల్లో నిల్వలు ఉంచి చైనా, ఇతర దేశాలకు ఓడరేవుల ద్వారా ఎగుమతి చేశారు. ఈసారి చైనాలో కూడా ఇండియాలో పండించిన మిరప తిప్పి పంపారు. మిరపకాయలు ల్యాబ్‌లో పరిశీలిస్తే అధిక మోతాదులో రసాయన మందులు వాడినట్లు నిర్ధారణ కావడంతో ఆ దేశం నుంచి వెనక్కి పంపారు. ఇండియా నుండి చైనాకు ఎగుమతి అయిన మిర్చిని కనీసం అక్కడ పారవేయడానికి కూడా ఒప్పుకోరు. ఎగుమతి అయిన సరుకు తిరిగి ఇండియాకే తిరిగి తెచ్చుకోవాలి. ఇలా అనేక కారణాలతో గతేడాది ఎండు మిరప పండించిన రైతులు ధర లేక, తిరిగి తెచ్చుకోలేక ఆవేదనకు గురయ్యారు. గిట్టుబాటు ధర అందించి ఆదుకోవాలని మిరప రైతులు పోరాటాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీడీపీఎస్ ద్వారా అనుమతులు పొందారు. రైతులు మిరప పంటను అమ్ముకునేందుకు ఈ- టెండర్లు, అలాగే మార్కెట్ యార్డులు అవసరం ఉంది. దీంతో కొనుగోళ్ల విషయంలో బాగా ఆలస్యం జరిగింది. కేంద్ర నిబంధనల ప్రకారం కర్ణాటక రాష్ట్రంలో ఎండమిరపను 73.732 టన్నుల మిరప మాత్రమే కొనుగోళ్ల చేయాలి. అయితే బళ్లారి జిల్లాలోనే ఏకంగా 61.400 హెక్టార్లలో ఎండుమిరప పండించారు. ఒక్క బళ్లారి జిల్లాలోనే 2.50 లక్షల టన్నులు ఉత్పత్తి అయింది. ఇక బళ్లారి జిల్లాలో ఉండే ఏపీఎంసీ మార్కెట్‌లో ఎండు మిరప అమ్ముకునేందుకు అవకాశం లేక రైతులు ఇబ్బంది పడ్డారు.

అంతక ముందు ఏడాది బ్యాడిగి మిరపకాయలు ఎక్కువ రేటు పలికింది. క్వింటాల్ ధర రూ.50వేల వరకూ అమ్ముడు పోయింది. ఈఏడాది రూ.6000కు పడిపోయింది. పక్కరాష్ట్రంలో అయిన ఆంధ్రప్రదేశ్‌లో కూడా మిరప ధర ఇలాగే ఉంది. గిడ్డంగుల్లో స్టాక్ పెట్టిన వ్యాపారులు బాగా నష్టపోయారు. కొందరు ఐపీలు పెట్టారు. ఒకరిద్దరు గిడ్డంగుల యజమానులు ఆత్మహత్యకు కూడా పాల్పడడం విషాదం. వచ్చిన ధరకు అమ్ముకుందా మనుకున్నా కొనేవారు కరువయ్యారు. అధిక రోజులు నిల్వ ఉంచితే నాణ్యత కోల్పోయి మరింత ధర తక్కువగా అడుగుతారు. దీంతో ఈ సారి అసలు పంట వేద్దామా వద్ద అన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. ఎందుకొచ్చిన బాధలే వరో.. పత్తి సాగుచేసుకుంటే సరిపోతుందిలే అన్న ఆలోచనలో ఉన్నారు. తక్కువ మంది రైతులు మిరప సాగుకు ఆసక్తి చూపే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



బళ్లారి ఏపీఎంసీలో ఎండు మిరప (ఫైల్)

నగరంలో దారుణం

- మహిళను చంపి... చెత్త లారీలో వేసిన దుండగులు

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని చన్నమ్మనకెరె అచ్చుకట్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న చెత్తలారీలో మహిళ మృతదేహాన్ని పడేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. స్కేటింగ్ గ్రౌండ్ వద్ద శనివారం రాత్రి చెత్తలారీని ఆపారు. మహిళపై అత్యాచారం చేసి ఆపై హతమార్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. రాత్రి పొద్దుపోయాక ఆటోలో మృతదేహాన్ని తీసుకొచ్చి చెత్తలారీలో పడేశారు. ఆమె వయస్సు సుమారు 30-35 సంవత్సరాలు ఉంటుందని గుర్తించారు. శనివారం రాత్రి ఓ వ్యక్తి చెత్తవేసేందుకు రాగా తలతోపాటు వెంట్రుకలు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశి పరిశీలించారు. సమీపంలోని సీసీకెమెరాల ఫుటేజీల ద్వారా పరిశీలించగా ఒక వ్యక్తి ఆటోలో శవాన్ని తీసుకొచ్చి లారీలో పడేసినట్లుగా గుర్తించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. జాయింట్ పోలీస్ కమిషనర్ వంశీకృష్ణ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు చేతులు, గొంతు భాగాన్ని తాడుతో బిగించి చంపేసి, సంచిలో తీసుకొచ్చినట్లు నిర్ధారించారు. పోలీసులు హత్యకేసుగా నమోదు చేసి నిందితులకోసం గాలింపు చేపట్టారు.

ఆకట్టుకున్న తెలుగు నాటకోత్సవం

7



నాటకంలోని ఓ సన్నివేశం



అటల్ బిహారీ వాజ్‌పేయి పార్క్‌లో మగపులి రేవా

మంగళూరు నుంచి కంప్లికి..
పెద్దపులి రేవా

కంప్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళూరులోని పిలికుల బయోలాజికల్ పార్కు నుంచి రేవా అనే మగ పులిని హంపి సమీపంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి జియోలాజికల్ పార్క్‌కు ఆదివారం తీసుకువచ్చారు. ఇది కర్ణాటకలో సఫారీ ఉన్న ఏకైక జూ గా పేరు గాంచింది. ఇటీవల జూకు పర్యాటకు సందర్శన పెరిగింది. హంపికి వచ్చిన పర్యాటకులు కమలాపురం వద్ద వుండే అటల్ బిహారీ వాజ్‌పేయి జూ ను సందర్శిస్తున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఇతర జూల నుంచి జంతువులను తరలిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. సందర్శకులు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1622.12	1,581.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,366	1.056
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	213	2037
నీటి నిల్వ (టీఎంసీలు)	67.47	5.37

వ్యక్తి హత్య

బళ్లారి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా గంగావతి తాలూకా వెంకటగిరి గ్రామ శివార్లలో శనివారం విఠలాపూర్ గ్రామానికి చెందిన ఎస్. ఈరప్ప(32) అనే వ్యక్తి హత్యకు గురయ్యారు. గంగావతి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు విఠలాపూర్ గ్రామానికి చెందిన హనుమంత భార్యతో ఈరన్న అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానం ఉండేది. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం భార్యను పుట్టింటికి పంపిచారు. హత్యకు గురైన ఎస్. ఈరన్న కూడా ఏడాది క్రితం ఊరి వదిలి వెళ్లిపోయాడు. మూడు రోజుల క్రితం ఈరన్న ఊరికి వచ్చారు. దీన్ని తెలుసుకున్న హనుమంత, మరొకరు సిద్దరామేష్ ఇద్దరూ కలిసి విఠలాపురం గ్రామ సమీపంలో ఈరన్నను గొడ్డలితో నరికి హత్యచేశారు. నిందితుడు హనుమంత నేరుగా పోలీస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. గంగావతి రూరల్ పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి కుంటలో పడి
కాడెద్దుల మృతి



ఎద్దుల కళేబరాలు

బళ్లారిరూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని రూపనగుడి గ్రామానికి చెందిన గంగాధర్ అనే రైతుకు చెందిన ఎద్దులు మృత్యువాత పడ్డాయి. ఆదివారం ఉదయం వ్యవసాయపొలానికి ఎద్దుల బండి కట్టుకుని వెళ్తుండగా అకస్మాత్తుగా రెండు ఎద్దులు బెదిరి నీటి గుంతలో పడ్డాయి. బండి తోలుతున్న యజమాని ప్రాణాలతో బయటపడ్డాడు. రెండు ఎద్దులు ఒక్కసారిగా నీటి గుంతలో దూకడంతో ఎద్దుల మెడకున్న కాడుమాను బిగుసుకుని రెండు ఎద్దులు నీటి గుంతలోనే మృత్యువాత పడ్డాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధినిచ్చే ఎద్దుల మృతితో నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కంప్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగపరచుకోవాలని కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 8వ వార్డు, సింధోల్ కాలనీలోని ఎండీసీఏపీలోని వీర నాగమ్మ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం బళ్లారి ఐఎంఎడబ్ల్యూడీబ్ల్యూ, కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్యపరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం ఒక గొప్ప వరం అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆధునిక కాలంలో ఆహారంతోనే అధిక ఆహార సమస్యలు తలెత్తుతు న్నాయన్నారు. పోషకాహారంతో ఆరోగ్యాన్ని కాపాడు కోవాలన్నారు. డాక్టర్ అరుణ, డాక్టర్ సంగీత కట్టేమని, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ ప్రణీత, డాక్టర్ రేణుక మంజునాథ్, నాయకులు జీ సుధాకర్, బీకే విరుపాక్షి, రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యంతో శ్రమిస్తే విజయం సాధ్యం

● పద్మశ్రీ గ్రహీత రాజన్న



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజన్న

బళ్లారి సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో శ్రమిస్తే విజయం సాధ్య మని పద్మశ్రీ అవార్డు గ్రహీత రాజన్న పేర్కొన్నారు. ఆదివారం హొసపేట నగరంలోని విజయనగర మహావిద్యాలయంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన ప్రేరణాత్మ ప్రసంగంలో ఆయన మాట్లాడారు. నాకు రెండు చేతులు, కాళ్లు లేకపోయినా నేను కష్టపడి పనిచేశాను. జీవితంలో ఏదైనా సాధించాలని అనుకున్నాను. నేను పెయింటింగ్స్ మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నాను. ఓ సందర్భంలో నేను గీసిన జాతీయ పక్షినెమలి చిత్రాన్ని రాష్ట్ర గవర్నర్ చూసి మొదటి బహుమతి ఇచ్చి సత్కరించారన్నారు. దివ్యాంగులు, దివ్యాంగుల పిల్లల కోసం ఒక సంస్థను స్థాపించి శిక్షణ, విద్యా శిబిరాలద్వారా వారు స్వతంత్రంగా జీవించడానికి బోధించడం, ప్రోత్సహించడం చూసి 2013లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య కర్ణాటక రాష్ట్ర దివ్యాంగుల సంస్థకు కమిషనర్‌గా నియమించారన్నారు. దీంతోనే దివ్యాంగులకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. తన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించడం హర్షణీయమన్నారు. కళ సంగీతం, సాహిత్యం సహా సమాజానికి సేవ చేయడం ద్వారా బాగా చదువుకోవాలని, డిగ్రీ పొందాలని, ఏదైనా సాధించాలని, మంచి పౌరులుగా దేశానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. మీలోఎవరైనా పద్మశ్రీ, పద్మభూషణ్ , భారతరత్న, రాష్ట్రపతి,ప్రధానమంత్రి కూడా కాగలరని, లక్ష్యంతో చదవాలన్నారు. ఈసందర్భంగా విజయనగర కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుగౌడ ప్రీ యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునగౌడ, ఇండిపెండెంట్ కళాశాల ప్రిన్సిపాల్ నగేశ్ బాబు, పాత విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్రీపాద, కోరిశెట్ట లింగప్ప, చెన్నబసప్ప, ఒప్పట్టెప్ప, నంజుండస్వామి, నిమ్మగల్ రామకృష్ణ, కేదార్‌నాథ్, శ్రీమతి సుజాత, రేవణ్ణ సిద్దప్ప, భారతి పాల్గొన్నారు.

23 గ్రామాల్లో మొహర్రం నిషేధం

● రాయచూరు జిల్లా అధికారి నితీశ్



రాయచూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గతంలో వివాదాలు చెలరేగిన రాయచూరు జిల్లాలోని 23 గ్రామాల్లో మొహర్రం పండుగను నిషేధిస్తూ జిల్లా అధికారి కె. నితీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. పండుగ సందర్భంగా అల్లర్లు చెలరేగడం, పాత వైషమ్యాల కారణంగా ఆస్తుల విధ్వంసంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిషేధం విధించిన గ్రామాల వివరాలు ఇలా ఉన్నాయి. సింధనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గిణివార, అరళహళ్లి, ఉప్పళ, గోరేబాళ, గుండా, తుర్విహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిడిగొళ-తిడిగోళ ఎలెకూడ్లిగి, చిక్కబేరి, మాన్వి పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిహాళ, జాగీర్‌పన్నూరు, జానేకల్, మదాపూర, సిరవార పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరవార పట్టణం, కడదిన్ని, బొద్దునాళ, కవితాళ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవితాళ పట్టణం, హిరే బాదరదిన్ని, బాగలవాడ, అమీన్‌గడ, గొగబాళ, మస్కి పోలీస్ స్టేషన్ పరిధిలోని తలేఖాన్, దేవదుర్గ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్, చించోడిలతో పాటు మొత్తం 23 గ్రామాలున్నాయి.

నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు
అప్రమత్తంగా వుండాలి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ నరసప్ప

సిరుగుప్ప, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తుంగభద్రనది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహసీల్దార్ నరసప్ప తెలియజేశారు. టీబీ డ్యామ్ నుంచి ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. శివమొగ్గ, మలెనాడు ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా డ్యామ్ నిండిపోయిన నేపథ్యంలో తుంగభద్ర నదికి నీరు విడుదల చేస్తామని టీబీ డ్యామ్ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తెలిపారు. తాలుకా పరిధిలోని దడేసూగూరు, నడివి, నిట్టూరు, కెంచనగుడ్డ, బాగేవడి, సిద్దరాంపురం, దేశనూరు, చిక్కబళ్లారి, ఉడదరాళు, అచ్చొళ్లి, కూడ్లూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని పేర్కొన్నారు.

ఎయిమ్స్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

● బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజ్ భండారి



విలేకరులతో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజ్ భండారి

రాయచూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న నిరవధిక పోరాటం పట్ల సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ చేసిన వ్యాఖ్యలు అనుచితమని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బసవరాజ్ భండారి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ప్రభుత్వ స్థలంలో పోరాటం సాగుతుండడాన్ని ప్రశ్నిస్తున్న సిటీ ఎమ్మెల్యే, ప్రజా సమస్యలు పట్టించుకోవాలన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి జిల్లాకు ఎయిమ్స్ ఏర్పాటు పై నిపుణుల కమిటీ సిపార్సుల అవసరమని చెప్పడం విడ్డూరమన్నారు. గతంలో నంజుండప్ప కమిటీ సిపార్సుల మేరకు జిల్లాకు మంజూరైన ట్రిబుల్ ఐటీని ఏ నిపుణుల కమిటీ ఆధారంగా ఇతర జిల్లాకు తరలించారో బీజేపీ నాయకులు తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మూడేళ్లుగా సాగుతున్న పోరాటానికి బీజేపీకి చెందిన సిటీ ఎమ్మెల్యే ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. తమ పార్టీ తరఫున ప్రతినిధుల బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రం పై ఒత్తిడి తేవాల్సిన ఎమ్మెల్యేఅసలు పోరాటాన్నే ఎత్తివేయాలనే రీతిలో మాట్లాడడం బాధ్యతరాహిత్యమే గాక జిల్లా ప్రజలను మోసగించడమేనన్నారు. కాగా ఎయిమ్స్ ఏర్పాటు జరిగే వరకు పోరాటం కొనసాగాలని పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతునిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

గూడ్స్ షెడ్ తరలింపు నిర్ణయం హర్షణీయం

● రైల్వే సలహా సమితి మాజీ సభ్యుడు బాబురావ్



మాట్లాడుతున్న బాబురావ్

రాయచూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : నగర నడిమధ్యలో ఉన్న రైల్వే గూడ్స్ షెడ్‌ను ఇక్కడి నుంచి తరలించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే తీసుకున్న నిర్ణయం హర్షణీయమని రైల్వే సలహా సమితి మాజీ సభ్యుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబురావ్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన సౌత్ సెంట్రల్ రైల్వే తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తు ఇది ఈ ప్రాంత ప్రజలు సుదీర్ఘంగా ఎదురు చూస్తున్న కల సాకారమైందన్నారు. కాగా 60 ఏళ్ల క్రితం ఏర్పాటైన గూడ్స్ షెడ్ వల్ల వాహన రాకపోకల సంచారం పెరగడమే గాక అనేక సందర్భాల్లో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయన్నారు. అదే సమయంలో మంచలాపూర్ లెవల్ క్రాసింగ్‌ను రైల్వే అండర్ బ్రిడ్జ్‌గా నిర్మించేందుకు రాయచూరు రైల్వే స్టేషన్ 4వ,5వ ప్లాట్‌ఫారంల అభివృద్ధి ఇతర పనులకు ఆమోదం లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● నెహ్రూ పాఠశాల ముఖ్య ఉపాధ్యాయురాలు జరీనా



మొక్కలు నాటుతున్న ముఖ్య ఉపాధ్యాయురాలు జరీనా

సిరుగుప్ప, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నెహ్రూ విద్యాసంస్థ ముఖ్య ఉపాధ్యాయురాలు జరీనా తెలిపారు. ఆదివారం తాలుకాలోని దేశనూరు గ్రామంలో నెహ్రూ విద్యాసంస్థ, శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పరిసర దినోత్సవాలను పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరీనా మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా మనుషులు ఉత్తమ పరిసరాలు పొందుతారని దీని వల్ల మనిషి ఉత్తమ ఆరోగ్యం పొందేందుకు సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా ధర్మస్థల గ్రామీణ యోజన అధికారి సుధీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



తాగునీటి కొళాయిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర్

బస్టాండ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కంప్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ ఆదివారం ఆకస్మికంగా హోస్పేట బస్టాండ్‌ను తనిఖీ చేశారు. బస్టాండులో ప్రయాణికులు తాగునీరు, శౌచాలయాలు విశ్రాంతి గదులు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బస్టాండ్‌లో సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని ప్రయాణికులకు సూచించారు. పాఠశాలల సమయానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. బస్టాండ్‌లో సమస్యలపై తమకు ఫిర్యాదు చేసినట్లయితే ఏ అధికారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీరు ట్యాంకు వద్ద పరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో అధికారులు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు.

పదాధికారుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పెయింటర్స్ అసోసియేషన్ పదాధికారులు

కంప్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకా పెయింటర్ వర్కర్స్ అసోసియేషన్ సంఘం పదాధికారుల నియామకం విరుపన్న తాత మఠంలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఎం మారుతి కే విరుపాక్షి, గౌరవాధ్యక్షుడిగా బి మౌనేష,ఎస్ బెట్టరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా బసవరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ రమేష్, గౌరీప్రియ, సుదర్శన్, యల్లప్ప, కృష్ణ, జాయింట్ సెక్రెటరీగా సీ నాగరాజు, ఈ సంఘానికి గాలెప్ప, ఉస్మాన్, విరూపన్న, బీఎం మాజు, చిత్రగార రాము, ఖాసీం, జగదీష్, కే రాఘవేంద్ర, కే మహేష్, ఎల్ సిద్దప్ప, ఎస్ మంజు, చిత్రగార, నాగరాజు, ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ దురుగప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షులు మారుతికి పూలమాలలతో సత్కరించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



కార్పొరేటర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

బళ్లారిరూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో 35వ వార్డులో తాగునీటి సమస్యను స్థానిక కార్పొరేటర్ మించు శ్రీనివాస్ తక్షణమే పరిష్కరించారు. ఆదివారం వార్డు పర్యటనలో స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే స్థానిక అధికారులను పిలిపించి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని, నీటి సమస్య వుండకుండా వీలైనంత త్వరలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



చెస్‌పోటీలను ప్రారంభిస్తున్న సునిల్ గుండె

బళ్లారి సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించడానికి చదరంగం పోటీలు ఉపయోగపడతాయన ట్రెండీ పేపర్ యజమాని సునీల్ గుండె అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలోని గాంధీనగర్ వాటర్‌బూస్ట్ సమీపంలోని ట్రెండీ పేపర్ కాంప్లెక్స్‌లో బళ్లారి చెస్ అకాడమీ, ట్రెండీ పేపర్ ఆధ్వర్యంలో 15ఏళ్ల పిల్లలకు రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బళ్లారిలో చదరంగం పోటీలను నిర్వహించడం రెండవసారి అని, ఈసారి బళ్లారి, జేఎస్‌డబ్ల్యూ ,హొస్పేట్, బెంగళూరు, బీదర్, ఉడిపి, కుందాపూర్, హైదరాబాద్, అనంతపురం, గుంతకల్లు నుంచే కాక యుఎస్ఏ నుండి ఇషాన్ అనే విద్యార్థి కూడా పాల్గొన్నారు. పోటీలో మొత్తం 135మంది పిల్లలు పాల్గొన్నారు. చదరంగంతో మెదడుకు పదును పెట్టడం సులభమన్నారు. ఇటువంటి క్రీడా పోటీలో పిల్లల చురుకుదనం ,ప్రతిభ మెరుగుపడుతుందని అన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన పిల్లలకు వివిధ రకాల నగదు బహుమతులు, సీల్డ్ సర్టిఫికెట్లుఅందజేశారు. ఈసందర్భంగా బళ్లారి చెస్ అకాడమీ కోచ్ ఎస్ఎండీ రఫిక్, బసవేశ్వర మెడికల్ సెంటర్ ఆర్థోపెడిక్ డాక్టర్ భరత్, బళ్లారి చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విరూపాక్షయ్య, సెక్రటరీ నాగరాజు,చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర సింథిల్, డి.ఎం.శివకుమార్, డాక్టర్ భరత్ పాల్గొన్నారు.

పాఠశాలకు మరమ్మతులు చేపట్టండి

● అధికారులకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సూచన

బళ్లారి సిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వ వార్డు లాల్‌కమాన్ వీధిలోని ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూల్ భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం నమస్తే బళ్లారి అభియాన్‌లో భాగంగా ఆయన వార్డుల్లో పర్యటించారు. లాల్‌కమాన్ పాఠశాలను సందర్శించిన ఆయన శిథిలమైన భవనాన్ని పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సుమారు రూ.కోటి రూపాయలతో మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం 3వవార్డులో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. మౌలిక సౌకర్యాలు కరువైన చోట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డు సభ్యుడు ప్రభంజన్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి వార్డు పర్యటనలతో సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈసందర్భంగా మాజీ మేయర్ రాజేశ్వరీ, సభ్యులు నూర్ మహమ్మద్, మించు సీనా, కాంగ్రెస్ ప్రముఖులు సుబ్బరాయుడు, బీఆర్ఎల్ సీనా, గోవింద, మంజునాథ్ పాటిల్, రఘునాథ్‌పాటిల్, మహాదేవ, కుమారన్, బసవ, కిరణ్,సూరి, రాకేశ్, విశ్వ, పర్వీన్ బాను పాల్గొన్నారు.



వార్డు పర్యటనలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్

హోసూరు జోన్

సాగునీటిపై పన్ను తగదు: సీపీఎం



నిరసనలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు

హోసూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సాగుకు ఉపయోగించే నీటిపై పన్ను విధించాలని ఆలోచిస్తున్న కేంద్రప్రభుత్వ తీరును రైతుసంఘం తప్పుబట్టింది. వెంటనే అలాంటి ఆలోచన విరమించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం నేతృత్వంలో రైతుసంఘం నిరసన తెలిపింది. నిరసనలో శూలగిరి సర్కిల్ కార్యదర్శి మురళి నాయకత్వం వహించారు. జిల్లా కార్యదర్శి ప్రకాశ్, చైర్మన్ మురుగేశన్ తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజ్, జిల్లా కమిటీ సభ్యుడు అనమప్ప, సీపీఎం శూలగిరి సర్కిల్ కార్యదర్శి మురుగన్, కెలమంగల యూనియన్ కార్యదర్శి రాజా తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి జస్టిస్ శరవణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దశ్యం

జిల్లా కోర్టును పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి

హోసూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కోర్టు సముదాయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరవణన్ శనివారం స్వయంగా పరిశీలించారు. కోర్టు సముదాయ భవనంలో హైకోర్టు జస్టిస్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. పోలీసులు, రెవెన్యూశాఖ, కోర్టు న్యాయవాదుల అంశాలపై చర్చలు జరిగాయి. న్యాయవాదుల సమస్యలను ఆలకించారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడుతూ జిల్లాలో వెయ్యిమందికిపైగా న్యాయవాదులు ఉన్నందున ఎస్సీ, ఎస్టీ కోర్టు, ఖనిజ వనరుల ట్రయల్ కోర్టు, జిల్లాకోర్టుకు అదనపు భవనం కల్పించాలని కోరినట్టు తెలిపారు. కాగా డెంకణీకోట ప్రాంతానికి అదనపు జిల్లా న్యాయాధికారి కల్పించాలని కోరామన్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు ఆలకించామని, వారి డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి లత, జిల్లా ఎస్పీ తంగదురై తదితరులు ఉన్నారు.

సమాజసేవకు దక్కిన గౌరవ డాక్టరేట్

హోసూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రియల్‌ఎస్టేట్ రంగంతోపాటు సమాజసేవలో రాణిస్తున్న చింతలపల్లి మహేందర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ దక్కింది. ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో రాజణ్ణ సిరిసిల్లా జిల్లా ననుగుల గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ లభించడం ఎంతో సంతోషంగా ఉందని యూనివర్సిటీకి, తన శ్రేయోభిలాషులు, మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న మహేందర్‌రెడ్డి

కృష్ణా నదికి పెరిగిన వరద

రాయచూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో కృష్ణనదికి ప్రవాహం పెరగడంతో నది మధ్య భాగంలోని ఉండే మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురు వ్యక్తులు చిక్కుకు పోయారు. ఆదివారం ఉదయం నారాయణపూర్ నుంచి దిగువకు 1 లక్ష 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఒక్క సారిగా వరద ప్రవాహం పెరగడంతో నడిగడ్డలో వివిధ అవసరాల కోసం వెళ్లిన వారు వరద పెరగడంతో అక్కడే చిక్కుకు పోయారు. వీరిలో మాదరగడ్డలో ఇద్దరు, హొంకమ్మన గడ్డలో ముగ్గురు, గొర్ల కాపరులు ఉండగా మరో నడిగడ్డలో ఇద్దరు చిక్కుకు పోయారు. వీరిని రక్షించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

దాదాభాయ్ నౌరోజీ (వర్ధంతి)



'గ్రాండ్ ఓల్డ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన సర్ దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4న గుజరాత్ రాష్ట్రం నవ్సారి పట్టణంలో జన్మించారు. భారత అనధికార రాయబారిగా గుర్తింపు పొందారు. పార్సీ స్కాలర్, వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు, లిబరల్ పార్టీనుంచి ఎంపీగా యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ కామన్స్‌కు 1892 నుంచి 1895వరకు వ్యవహరించారు. బ్రిటీష్ ఎంపీ అయిన తొలి ఆసియా ఖండవాసి. కాంగ్రెస్‌పార్టీ సంస్థాపకులలో ఒకరు. 1917 జూన్ 30న కన్నుమూశారు.

జేవీ సోమయాజులు (జయంతి)



తెలుగు ప్రేక్షకుల హృదయాలలో 'శంకరాభరణం' శాస్త్రిగా పేరొందిన జొన్నలగడ్డ వెంకట (జేవీ) సోమయాజులు 1928 జూన్ 30న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. రంగస్థలం, వెండితెర, బుల్లితెర అన్నింటిలోనూ నటించారు. సోదరుడు రమణమూర్తితో కలసి 'కన్యాశుల్కం' నాటకాన్ని 45ఏళ్లలో 500కుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో 'రామప్పపంతులు' పాత్రతో పేరొందారు. అనంతరం బుల్లితెరపై 'కన్యా శుల్కం' నాటకాన్ని 13భాగాలుగా రూపొందించారు. జంటనగరాలలో నాటకకళ ప్రోత్సాహానికి 'రసరంజని' సంస్థను స్థాపించారు. సాంస్కృతిక విభాగంలో డైరెక్టర్‌గా పనిచేశారు. 2004 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

కళ్యాణ్‌జీ (జయంతి)



ప్రముఖ సంగీత ద్వయం కల్యాణ్‌జీ-ఆనంద్‌జీ సోదరులలో కళ్యాణ్‌జీ విర్జి షా ఒకరు. 1928 జూన్ 30న గుజరాత్ రాష్ట్రం కచ్ ప్రాంతం కుద్రోడిలో జన్మించారు. నాలుగు దశాబ్దాలలో 250కు పైగా హిందీ సినిమాలకు సోదరు లిద్దరూ సంగీతంలో తమదైన ముద్రను చాటారు. అందులో 17 గోల్డెన్‌జుబ్లీ సాధించగా 39 సిల్వర్ జుబ్లీలు ఉన్నాయి. 1968లో సరస్వతీ చంద్ర జాతీయ పురస్కారం పొందారు. 1975లో ఉత్తమ సంగీత దర్శ కుడిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారాన్ని 'కోరా కాగజ్'కు అందుకున్నారు. 'పద్మశ్రీ'తోపాటు ఎన్నో అవార్డులు పొందారు. 2000 ఆగస్టు 24న కల్యాణ్ జీ కన్నుమూశారు.

పప్పు వేణుగోపాలరావు (జయంతి)



డాక్టర్ పప్పు వేణుగోపాలరావు 1948 జూన్ 30న విజయనగరం జిల్లా బొబ్బిలిలో జన్మించారు. విద్యావేత్త, సంగీతంపై శాస్త్రీయ పరిశోధనలు చేశారు. తెలుగు, సంస్కృత సాహిత్యంలో రాణించారు. సంగీతం, నృత్యం, సంస్కృతి, ఆధ్యాత్మికతపై 20 పుస్తకాలు రాశారు. దాశరథి శతకాన్ని ఆంగ్లంలోకి అనువదించగా పొట్టిశ్రీరాములు యూనివర్శిటీ ప్రచురించింది. ప్రపంచ తొలి యానిమేషన్ రామాయణ సీడీకి ఆయన స్క్రిప్ట్ రాశారు. నాట్యశాస్త్రంపై ఎన్నో ప్రసంగాలు చేశారు. కళా విపంచి, సంగీతశాస్త్ర విశారద, సంగీత శాస్త్రనిధి, అష్టావధాన శేఖర తదితర బిరుదులు పొందారు. 2024 ఏప్రిల్ 7న కన్నుమూశారు.

డాక్టర్ సీఎన్ఆర్ రావు (పుట్టినరోజు)




ప్రముఖ శాస్త్రవేత్త 'భారతరత్న' గ్రహీత చింతామణి నాగేశ రామచంద్ర రావు (సీఎన్ఆర్ రావు) 1934 జూన్ 30న బెంగళూరులో జన్మించారు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీలో 1,770 పరిశోధనా వ్యాసాలు, 53 పుస్తకాలు రచించారు. 24 ఏట పీహెచ్‌డీ అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 83 యూనివర్శిటీల నుంచి గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. కర్ణాటక రత్న, ఇండియన్‌సైన్స్ అవార్డులు అందుకున్నారు. సీవీ రామన్, అబ్దుల్ కలాంల తర్వాత 'భారతరత్న' అందుకున్న శాస్త్రవేత్త ఆయనే. 'జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్' సంస్థాపకులు. ప్రధానమంత్రి సైంటిఫిక్ అడ్వైజరీ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా 1985 నుంచి 89మధ్య, 2005 నుంచి 2014 వరకు వ్యవహరించారు. 'పద్మశ్రీ', పద్మవిభూషణ్ తదితర పురస్కారాలు అందుకున్నారు.

సనత్ జయసూర్య (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ సనత్ తేరన్ జయసూర్య 1969 జూన్ 30న జన్మించారు. శ్రీలంక క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గానే కాక ఆల్‌రౌండర్‌గా సత్తా చాటుకున్నారు. బ్యాటింగ్‌లో రాణించి జట్టుకు ఎన్నో విజయాలు అందించారు. వన్డేలలో 10వేల పరుగులు, 300కుపైగా వికెట్లు సాధించి తనదైన రికార్డు నెలకొల్పారు. ఐసీసీ వరల్డ్ ట్వంటీ-20లో 2014లో శ్రీలంక విజయానికి ఆయనే సారథ్యం వహించారు. 48సార్లు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 11 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' గుర్తింపు పొందారు. తన కెరీర్‌లో 15వేలకుపైగా పరుగులు, 400కుపైగా వికెట్లతో 'లిస్ట్ ఏ క్రికెట్'లో ఆల్‌రౌండర్‌గా నిలిచారు.

మైఖేల్ ఫెల్ప్స్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన ప్రముఖ ఈతగాడు మైఖేల్ ఫ్రెడ్ ఫెల్ప్స్-2 1985 జూన్ 30న జన్మించారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించారు. 23 ఒలింపిక్ గోల్డ్‌మెడల్స్‌తో ఆల్-టైమ్ రికార్డు సాధించారు. ఇంటర్నేషనల్ లాంగ్ కోర్సు కాంపిటీషన్స్‌లో 65 బంగారు, 14 రజత, 3 కాంస్యపతకాలు సాధించారు. వరల్డ్ చాంపియన్‌షిప్స్, పాన్ పసిఫిక్ చాంపియన్‌షిప్స్ తదితర పోటీలలో భాగస్వామ్యులయ్యారు. వరల్డ్ స్విమ్మర్ ఆఫ్ ఇయర్ 8సార్లు, అమెరికన్ స్విమ్మర్ ఆఫ్ ఇయర్ అవార్డు 11సార్లు అందుకున్నారు. ఫినా స్విమ్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును 2012, 2016లో అందుకున్నారు. సొంతంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈత సహా పలు ఆరోగ్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

» సర్వేయర్ల డిమాండ్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సర్వేయర్ల సంఘం పదాధికారులు

బంగారపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఇంతవరకు సర్వేయర్లకు తగిన సౌలభ్యాలు అందడంలేదని అఖిల కర్ణాటక ప్రభుత్వ సర్వేయర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు పాండురంగయ్య అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. శాఖలో సుమారు 25సంవత్సరాలుగా సేవలందిస్తున్నా తమకు తగిన సౌలభ్యాలు అందడంలేదని ఎమ్మెల్యేకు పాండురంగయ్య విన్నవించారు. శాఖ తరఫున పూర్వ 11-ఇ నక్షె, తత్కాల్‌పోడి, అలినేషన్ పూర్వ నక్షె, దరఖాస్తు పోడి అళతె, ఆకార్ బంద్, స్వామిత్ర, నక్షా మ్యాపింగ్, ఇ-స్వత్తు, రాజకాలువె, దేవస్థానం, కుంటె, పోడి తదితర అన్ని పనులు సకాలంలో పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న జీవనశైలికి అనుగుణంగా వేతనాలు లేవని పెంచాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం లేదా పర్మనెంట్ చేయాలని విన్నవించారు. ఇదే సందర్భంగా ఎమ్మెల్యేను ఆత్మీయంగా సత్కరించారు. బృందంలో సంఘానికి చెందిన రవిరాజు, నితిన్ ప్రభాకర్, అజయ్‌కుమార్, రక్షిత, సంతోష్, వెంకటేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా బయల్దేరిన బృందం

శిడ్లఘట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తాలూకానుంచి భక్తబృందం పాదయాత్రగా బయల్దేరారు. నీటి పారుదలశాఖ రిటైర్డు అధికారి కేశవమూర్తి, పతంజలి యోగా శిక్షణాకేంద్రం డీవీ వెంకటేశ్ నంజప్ప, భజరంగ్‌దళ్ వెంకోబరావు, ధనంజయ్‌ల నేతృత్వంలో బృందం బయల్దేరింది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు బయల్దేరారు. నంజప్పకు 73ఏళ్లు కాగా వెంకటేశ్‌కు 67ఏళ్లు, కేశవమూర్తికి 63ఏళ్లు ఇలా 60ఏళ్లు పైబడినవారు సహా 45మంది భక్తబృందం తిరుమలకు బయల్దేరారు. చిక్కబళ్ళాపురలో బయల్దేరిన బృందం శిడ్లఘట్ట నుంచి కొంతమంది సహా కైవారమీదుగా వెళ్తున్నారు. రాత్రి అక్కడే బస చేసి ఉదయానే కైవార తాతయ్యను దర్శించుకుని లక్ష్మీపుర క్రాస్, మదనపల్లి, కలికిరి, చిన్నగొట్టిగల్లు మీదుగా తిరుపతికి చేరుకోనున్నారు. కేవశమూర్తి మాట్లాడుతూ మొత్తం 7రోజుల పర్యటన అన్నారు. చిక్కబళ్ళాపుర సేవా ట్రస్టు ద్వారా తిరుపతికి వెళ్లే పాదయాత్రీకులకు తగిన సౌలభ్యం కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఆకట్టుకున్న తెలుగు నాటకోత్సవం



నాటకోత్సవంలో ప్రముఖులకు సన్మానం

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగు విజ్ఞానసమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ సహకారంతో రెండురోజులపాటు జరిగిన నాటకోత్సవాలు ఆకట్టుకున్నాయి. శనివారం పక్కింటి మొగుడు హాస్యనాటికను ప్రదర్శించి కడుపుబ్బా నవ్వించారు. నాటకోత్సవాలను కర్ణాటక నాటక అకాడమీ అధ్యక్షుడు నాగరాజమూర్తి ప్రారంభించారు. ఆదివారం 'పడమటి గాలి' రక్త సంబంధానికి ఆర్థిక సంబంధంతో జరిగే సంఘర్షణను నాటికలో పొందుపరిచారు. మాజీ ఐఏఎస్ అధికారి ఈ నాటికను సంక్షిప్తం చేశారు. నాటకోత్సవాల ముగింపులో తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు మాట్లాడుతూ నాటకం సమాజానికి ఉత్తమ సందేశం ఇచ్చే శక్తివంతమైన దృశ్య మాధ్యమం అన్నారు. సినిమాలు రాకముందు నాటకరంగమే వినోదానికి మూలమన్నారు. ఆ రంగం నుంచే సినిమా ఉద్భవించిందన్నారు. తెలుగు, కన్నడ నాటకాలు సమన్వయం చేసిన ఘనత రామకృష్ణాచార్యులు, బళ్ళారి రాఘవ, గుబ్బి వీరణ్ణ వంటివారికే దక్కుతుందన్నారు. నాటకాలను ప్రోత్సహించడం ద్వారా అలనాటి బాంధవ్యాన్ని భవిష్యత్తు తరానికి అందించినట్టు అవుతుందన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రమణబాబు, నాగరాజమూర్తి, పడమటి గాలి నాటిక దర్శకుడు పాటిబండ్ల ఆనందరావు, మాజీ ఐఏఎస్ అధికారి గుమ్మళ్ళ బలరామయ్యలను సత్కరించారు. సమితి ఉపాధ్యక్షులు గంగరాజు, ఆదికేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి, కోశాధికారి వరదరాజుతోపాటు సభ్యులు పాల్గొన్నారు. నాటకాలను చూసేందుకు పలువురు తెలుగు అభిమానులు తరలివచ్చారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు నిర్వాహక బృందం తదితరులు

దొమ్మసంద్ర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడామైదానంలో భారతరత్న అంబేడ్కర్ సేవాట్రస్టు ఆధ్వర్యంలో 2024-25లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్ఎస్ఎల్సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు పొందినవారికి ప్రతిభా పురస్కారాలు, ఇతరత్రా సామగ్రి ప్రదానం చేశారు. ఇదే సందర్భంగా 103ఏళ్లక్రితం అంబేడ్కర్ లా పట్టా పొందిన అంశాన్ని ప్రస్తావించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సుమారు వందమంది విద్యార్థుల ఉన్నత విద్యకోసం ప్రోత్సాహకాలు అందచేశారు. కూగూరు ప్రభుత్వ హైస్కూల్, హుస్కూరు ప్రభుత్వ హైస్కూల్, సర్జాపుర ప్రభుత్వ ఉర్దూ స్కూల్, ప్రభుత్వ మాదిరి బాలుర పాఠశాల, ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, సర్దార్ వల్లభాయ్‌పటేల్ హైస్కూల్ విద్యార్థులకు అవసరమైన రాతసామగ్రి పంపిణీ చేశారు. ఇటీవల సర్దార్‌వల్లభాయ్‌పటేల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి రిటైరైన జగదీశ్‌ను ట్రస్టు ఆధ్వర్యంలో ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు డాక్టర్ కళావతి మూర్తికుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మంజునాథ్‌సర్జా, మాజీ అధ్యక్షుడు ఎం శ్రీనివాస్, సమాజసేవకులు గోపి, ట్రస్టు అధ్యక్షుడు జీ మునియప్ప, ప్రధాన కార్యదర్శి మూర్తికుమార్, కోశాధికారి సతీశ్‌కుమార్ పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ జయంతిలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

మహదేవపుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టి కారణంగానే బెంగళూరు నగరం ప్రపంచంలోనే పేరొంది లక్షలాదిమంది జీవనానికి కారణమైందని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో హూడి స్పోర్ట్స్‌క్లబ్ కబడ్డీ క్రీడామైదానంలో శిరా తాలూకా స్ఫటికపురి పీఠాధిపతి నంజావధూస్వామి సాన్నిధ్యంలో మాజీ మంత్రి అరవింద లింబావళి నేతృత్వంలో కెంపేగౌడ 516వ జయంతి ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ మనం స్మరించే నాయకులు కేవలం ఒకవర్గానికి పరిమితం కారాదన్నారు. కులంపిచ్చితో వెంటపడరాదన్న బసవణ్ణ వ్యాఖ్యలను ప్రస్తావించారు. బెంగళూరులో అన్నివర్గాల ప్రజలు నివసిస్తున్నారని, విద్య, పోరాటం, ప్రామాణికత కారణంగానే ఇంత ప్రగతి సాధ్యమయ్యేందుకు కెంపేగౌడ దూరదృష్టియే కారణమన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి, బీజేపీ రూరల్ హోబళి అధ్యక్షుడు హెచ్ఎస్ పిళ్ళప్ప, నగర హోబళి అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, మాజీ అధ్యక్షుడు నటరాజ్, మనోహర్‌రెడ్డి, పాపణ్ణ, కేవీ నాగరాజ్, కణ్ణూరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నైపుణ్యతను పెంపొందించుకోవాలి



తరగతుల ప్రారంభంలో పీఈఎస్ చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి తదితరులు

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అకడమిక్‌తోపాటు సాంకేతికపరమైన అంశాలలో నైపుణ్యతను పెంచుకోవాలని పీఈఎస్ చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. 2025-26 పీఈఎస్ పాలిటెక్నిక్ డిప్లమో తరగతులను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి జవహర్ దొరస్వామి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో గడిపే సమయంతోపాటు బయట కూడా అధ్యయనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తమ లక్ష్యాలను చేరుకునేందుకు కఠిన పరిశ్రమ, ఉత్తమ సాంకేతిక నైపుణ్యతను మెంటార్‌లనుంచి పొందాలన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్, హనుమంతనగర్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ దేవరాజ్ పాల్గొన్నారు. 2023-24, 24-25 బ్యాచ్‌లకు సంబంధించిన విద్యార్థులకు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి పేరిట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు.

తండ్రిని పాతికేళ్ల బైక్‌పై దేశం తిప్పిన కొడుకు

» 10లక్షల బైక్‌ను బహూకరించిన షోరూం



షోరూం అందించిన బైక్‌తో ప్రజ్వల్‌షెణై, అతడి కుటుంబం

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల బైక్‌పై కుమారుడు తండ్రిని దేశంలోని ప్రముఖ ఆలయాలను చూపించాడు. ఉడుపి నుంచి బయల్దేరి 2,110 కిలోమీటర్ల దూరంలోని అయోధ్యలోని బాలరాముడి దర్శనం చేయించారు. ఉడుపి జిల్లా కాపు తాలూకా సిర్వ నివాసి ప్రజ్వల్‌షెణై 25 ఏళ్లనాటి స్ప్లెండర్ బైక్‌పై తండ్రిని దేశవ్యాప్తంగా 50వేల కిలోమీటర్లకుపైగా తిప్పారు. 17,982 మీటర్ల ఎత్తున ప్రపంచంలోనే రెండో అతి ఎత్తైన ప్రదేశం జమ్ము-కశ్మీర్‌లోని ఖర్దుంగ్లాలో కన్నడ పతాకాన్ని ఎగురవేసి అభిమానం చాటారు. ఇటీవలే ప్రజ్వల్ షెణైకు సంబంధించిన సాధన, తండ్రీకొడుకుల ప్రయాణం వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఈమేరకు హీరో మోటోకార్ప్ సంస్థ ప్రజ్వల్‌షెణైకు రూ.10లక్షల విలువైన హీరో సెంటినియల్ వాహనాన్ని బహూకరించారు. తండ్రీ కొడుకులు దేశంలోని 17 రాష్ట్రాలలో పర్యటించారు. ఈమేరకు ఉడుపిలోని శక్తి షోరూం శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజ్వల్‌షెణైకు బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. హీరో మోటోకార్ప్ వ్యవస్థాపకులు డాక్టర్ బిజ్ మోహన్ లాల్‌ముంజాల్ 100వ జయంతిని పురస్కరించుకుని సెంటినల్ బైక్‌ను తయారు చేసి అందించారు.

కాగా అయోధ్య రామమందిరంతోపాటు 9రోజులలో 4వేల కిలోమీటర్లను ప్రయాణించి ప్రయాగ్‌రాజ్ చేరుకుని మహాకుంభమేళాలో పవిత్రస్నానం చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు కశ్మీర్, తిరుపతి, మధురై, కన్యాకుమారి, పూరి, షిర్డీ, నాసిక్, పండరీపురతోపాటు వివిధ ప్రాంతాలను సందర్శించినట్టు ప్రజ్వల్ తెలిపారు.

హులిమావు చెరువులో పచ్చదనం పెంపు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హసిరు సంకల్ప' పేరిట పచ్చదనం పెంచేందుకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వేగాసిటీ వద్ద బయో ఎనర్జీ చైర్మన్ సుదీంద్ర ప్రారంభించారు. అనంతరం హుళిమావు చెరువు ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి సహకారంతో పలురకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీన్‌సిటీగా బెంగళూరు పేరొందిందన్నారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపు నిచ్చారు. పచ్చదనం వల్ల కాలుష్యనియంత్రణకోసం పాటుపడాలన్నారు. మొక్కలు నాటడంతోనే పరిమితం కాకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. పచ్చదనం పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మురళి, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అమరనాథ్ యాత్రపై అవగాహన



ప్రదర్శనను వీక్షిస్తున్న సందర్శకులు

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అమరనాథ్ యాత్రపై రాష్ట్రస్థాయి ఉచిత సమాచార అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అమరనాథ్ యాత్రకు సంబంధించి జ్ఞానజ్యోతి ఆడిటోరియం ఎదురుగా ఉన్న వైహెచ్ కల్యాణమండపంలో ఛాయాచిత్రాలు ప్రదర్శించారు. శివశక్తిమండల్ రాష్ట్రశాఖ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. శివశక్తి మండల్‌కు దేశవ్యాప్తంగా 47శాఖలు ఉన్నాయి. అమరనాథ యాత్ర చేపట్టే యాత్రీకులకు తగిన వ్యవస్థతోపాటు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నారు. అమరనాథ్ యాత్ర చేపట్టేవారికి తగిన వివరాలు తెలియచేశారు.

ఆకట్టుకున్న ప్రకృతి కళాఖండాలు



కళాఖండాన్ని గీస్తున్న కళాకారిణి

బెంగళూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ మ్యాటర్స్ ఎన్జీఓ సంస్థ నగరంలోని ఓరియన్‌మాల్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నగరంలోని 30మంది ప్రముఖ ఆర్టిస్టులతోపాటు 50స్కూళ్లకు చెందిన చిన్నారులు విజువల్ ఆర్ట్‌లు వేశారు. ప్రకృతి, వాతావరణంలో మార్పులు వంటి అంశాలపై కళాఖండాలు గీశారు. కాన్వాసుపై ప్రకృతితో కూడిన కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణ అనిపించాయి.

కోనేరులో పడి బాలుడి మృతి



కుశాల్ (ఫైల్)

ముళబాగిలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కురుడుమలె వినాయక ఆలయానికి వచ్చిన చిత్రదుర్గ జిల్లా మాళక్కెరె తాలకట్టె గ్రామానికి చెందిన మంజునాథ్ కుమారుడు కుశాల్ (9) మృతి చెందాడు. ఆదివారం ఉదయం సుమారు 10.30గంటలకు ఆలయ ఆవరణలోని పుష్కరిణి (కోనేరు)లో పడిన బాలుడు మృత్యువాత పడ్డాడు. కుటుంబ సమేతంగా మంజునాథ్ కురుడుమలె వినాయక ఆలయానికి వచ్చాడు. ఆటలాడుతున్న కుశాల్ సుమారు 8 అడుగుల లోతు ఉన్న కోనేరులో పడి మృతి చెందాడు. బాలుడి అకస్మిక మృతితో వారి కుటుంబంలో విషాదం నెల కొంది. ముళబాగిలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి హత్య - ముగ్గురు నిందితుల అరెస్టు



రామాంజి (ఫైల్)

చింతామణి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకా రామపుర గ్రామానికి చెందిన 31ఏళ్ల రామాంజికి లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నగదు వసూలు చేశారు. అయితే జాప్యం చేయడంతో నగదు వాపసు ఇవ్వాలని అడిగినందుకు ఏకంగా హతమార్చారు. ఇందుకు సంబంధించి ముగ్గురు నిందితులను చింతామణి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సుధాకర్ (26), మంజునాథ్ (27), ఎం మనోజ్ (23)లను అరెస్టు చేశారు. ఈరణ్ణకు చెందిన బావిలో గుర్తు తెలియని శవం సోమవారం లభించింది. హతమార్చిన అనంతరం రామాంజి ఆచూకీ లభించరాదనే ఉద్దేశ్యంతో మృతదేహానికి పెద్దబండరాయిని తాడుతోకట్టి పడేశారు. చివరకు పోలీసులు నిందితుల ఆచూకీని గుర్తించి అరెస్టు చేశారు.